సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



డీజేలతో గుండె గుబేల్ !

పండుగలు, పెళ్లిళ్లు, ఉత్సవాల సందర్భంగా విపరీతమైన డీజే శబ్దాలతో పలు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. IIలో ▸



పెంటపాడులో హత్య

పెంటపాడులో హత్య కలకలం రేపింది. తల్లిని చంపేందుకు వెళ్తున్న వ్యక్తిని అతని మేనమామ కత్తితో పొడవడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. IIలో ▸



అధిక దిగుబడుల కోసం..

వరిలో మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. IIలో ▸



భీమవరంలో మావుళ్లమ్మ



ద్వారకాతిరుమలలో కుంకుళ్లమ్మ



ఏలూరు పత్తేబాదలో కనకదుర్గమ్మ



నూజివీడులో కోట మహిషాసురమర్దని



తాడేపల్లిగూడెంలో బలుసులమ్మ

శుభంకరి.. బాలా త్రిపుర సుందరి

అమ్మా భవానీ.. సదా స్మరామీ.. దుర్గామాతా నమోస్తుతే.. అంటూ శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో అమ్మవార్లు తొలిరోజు బాలా త్రిపుర సుందరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. - సాక్షి నెట్‌వర్క్

న్యూస్‌రీల్

డాక్టర్ బాబ్జీకి జగన్ పరామర్శ

పాలకొల్లు సెంట్రల్: ప్రముఖ వైద్యుడు, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ సత్యనారాయణమూర్తి(బాబ్జీ) కుమారుడు అంజిబాబు మృతి పట్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం తెలిపారు. సోమవారం డాక్టర్ బాబ్జీకి ఫోన్ చేసిన జగన్‌మోహన్‌రెడ్డి అంజిబాబు మృతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



డీవైఈఓకు వినతిపత్రం ఇస్తున్న అప్పలస్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం డీవైఈఓ రామాంజనేయులకు ఏఐఎస్ఏ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. అప్పలస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు దసరా సెలవులు ప్రభుత్వం ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2 వరకు ఇచ్చిందని, అయితే సెలవులు ఇవ్వని వారిపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని, పట్టణంలోని ప్రైవేటు విద్యా సంస్థలు యథావిధిగా స్కూల్స్ నడిపారన్నారు. విద్యార్థి సంఘాలు స్కూల్స్ నడిపే వారి వద్దకు వెళ్తే మాకు పర్మిషన్ ఉందని సమాధానాలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

'గూడెం'లో 30.2 మి.మీ. వర్షపాతం



తాడేపల్లిగూడెంలో కురుస్తున్న వర్షం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 30.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ సోమవారం తెలిపారు. పెంటపాడు మండలంలో 18.0 మిల్లీమీటర్లుగా వర్షపాతం నమోదైందన్నారు. సోమవారం సాయంత్రం 5.40 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దాదాపు గంటన్నరకు పైగా కురిసిన వర్షంతో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, తాలూకా ఆఫీస్ సెంటర్, పంచాయతీ రాజ్ కార్యాలయం తదితర లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరింది.

25న డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీఎస్సీ–2025లో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఈ నెల 25న అమరావతిలో నియామక లేఖ అందిస్తారని జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈ నెల 24న సాయంత్రం 4 గంటలకు ఏలూరులో నిర్వహించే వెన్యూకి వచ్చి రిపోర్ట్ చేయాలని, అక్కడి నుంచి 25న ఉదయం 8 గంటలకు బస్సు ద్వారా మధ్యాహ్నం 12 గంటలకు నేరుగా అమరావతిలో జరిగే కార్యక్రమ ప్రాంగణానికి చేరుకుంటారన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అమరావతిలో నియామక లేఖ అందచేస్తారన్నారు.

ఇన్‌చార్జ్ బీసీ వెల్ఫేర్ అధికారిగా సూరిబాబు

భీమవరం (ప్రకాశంచౌక్): ఇన్‌చార్జ్ జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిగా ఏవీ సూరిబాబు నియమితులయ్యారు. సోమవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో కలెక్టర్‌ని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పొంగుతున్న ముగ్గురాళ్ల వాగు

టి.నరసాపురం: మండలంలో కురిసిన భారీ వర్షానికి ముగ్గురాళ్ళ వాగు, జలవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇటీవల భారీ వర్షాలతో వాగులు ఉధృతంగా ప్రవహించడంతో మండలంలోని బండివారిగూడెం-మక్కినవారిగూడెం, టి.నరసాపురం - మక్కినవారిగూడెం గ్రామాల మధ్య రెండు రోజుల పాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం రాత్రి మరోసారి భారీ వర్షం కురవడంతో ముగ్గురాళ్ళవాగు, జలవాగులు వంతెనపై నుంచి పొంగి ప్రవహిస్తుండడంతో ఆ మార్గంలో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు, పోలీసు సిబ్బంది వాగును పరిశీలించి రోడ్ల వద్ద హెచ్చరికలు ఏర్పాటు చేశారు.

మా దగ్గరే ఇసుక కొనాలి!

- తాడేపల్లిగూడెంలో సరికొత్త ఇసుక దందా
- ఇసుక రీచ్‌ల నుంచి తెచ్చి విక్రయిస్తే నియోజకవర్గంలో కేసులు
- షాడో ఎమ్మెల్యే పేరుతో స్టాక్ పాయింట్
- ఎమ్మెల్యే తనయుడు కనుసన్నల్లో గూడెం ఇసుక దందా వ్యాపారం
- సిద్ధాంతం నుంచి ఇసుక తెస్తే రూ.12 వేలే
- స్టాక్ పాయింట్‌లో కొంటే మాత్రం రూ.17 వేలు
- బయట రీచ్‌ల నుంచి ఇసుకను తెచ్చే లారీలపై కేసుల పేరుతో వేధింపులు



తాడేపల్లిగూడెం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఇసుక డంప్ చేసిన దృశ్యం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఇది మా నియోజకవర్గం.. మేం చెప్పిందే జరగాలి.. మేం చేసిందే చట్టం.. ఏ వ్యాపారమైనా మాదే పెత్తనం.. ఎక్కడో రీచ్ నుంచి ఇసుక తీసుకొచ్చి లోకల్‌గా అమ్ముకుంటే కుదరదు. మా స్టాక్ పాయింట్‌లో మేం పెట్టిన రేటుకే కొనుగోలు చేయాలి. లేదంటే కేసులు, సీజ్‌లతో స్టేషన్లు, తహసీల్దార్ల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇది ప్రజాప్రతినిధి తనయుడి టీం హెచ్చరిక. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సరికొత్త ఇసుక దందాకు తెరతీశారు. సమీపంలోని రీచ్‌ల నుంచి ఇసుక తేవడానికి వీల్లేదని హుకుం జారీ చేసి స్థానికంగా లారీకి రూ.5 వేలు అదనంగా చెల్లించి మరీ కొనుగోలు చేయాల్సిందేనని నిర్బంధ వ్యాపారానికి తెర తీయడం వివాదాస్పదంగా మారింది.

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తెరచాటున దందాలకు శ్రీకారం చుట్టారు. ప్రతి దందా, ప్రతి వ్యవహారం ఎమ్మెల్యే కనుసన్నల్లోనే జరుగుతుంది కాని ఆయన పేరు ప్రస్తావన లేకుండా ప్రత్యేకంగా టీంలు ఏర్పాటు చేయడం ఆయన ప్రత్యేకత. నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేగా పేరున్న నేత పేరిట స్టాక్ యార్డ్‌ను ఏర్పాటు చేశారు. శశి ఇంజనీరింగ్ కళాశాల వద్ద 7 నెలల క్రితం స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. అక్కడ బోర్డు గానీ స్టాక్ యార్డ్ అని తెలిసేలా ఎలాంటి అధికారిక సమాచారం లేదు. ఇక తాడేపల్లిగూడెంకు సిద్ధాంతం రీచ్ కేవలం 40 కిలోమీటర్ల పరిధిలో ఉంటుంది. గోదావరిలోని ఇసుక నాణ్యత బాగుండటంతో ఇంటి నిర్మాణాలు, శ్లాబ్‌లకు రీచ్ ఇసుకనే వినియోగిస్తుండటంతో నియోజకవర్గంలో అందరూ సమీపంలోని రీచ్‌ల నుంచి ఇసుకను వాడుతున్నారు. 6 యూనిట్ల ఇసుక సుమారుగా రూ.11,500 నుంచి 12 వేల ధరకు నియోజకవర్గంలోని లారీ యజమానులే తెప్పించి విక్రయిస్తున్నారు. అది కూడా పూర్తిగా బిల్లుతో ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్వహిస్తున్నారు. ఆరుగొలను, కొత్తూరు, నవాబుపాలెంలో ఎక్కువ మంది లారీ యజమానులున్నారు. వీరిలో 60 శాతం మందికిపైగా జనసేన పార్టీలో కార్యకర్తలు, రకరకాల పదవుల్లో ఉన్నవారే కావడం గమనార్హం.

లారీకి రూ. 5 వేలు అదనం

జిల్లాలోని ఇసుక రీచ్‌లు సీఆర్‌జడ్ పరిధిలోకి వెళ్ళడంతో పశ్చిమగోదావరి అవసరాలకు తూర్పుగోదావరి జిల్లా నుంచి ఇసుకను తీసుకొస్తున్నారు. వరదల నేపథ్యంలో ప్రతి నియోజకవర్గంలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని దానిలో భాగంగా గూడెంలో 35,180 మెట్రిక్ టన్నులతో 7 నెలల క్రితం స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. టన్ను రూ.456 చొప్పున 20 టన్నులకు రూ.9120, ఎగుమతి కూలీ, జీఎస్టీ అన్ని కలిపి రూ.12 వేలు, రవాణా ఛార్జీ రూ.5 అదనంగా కలిపి రూ.17 వేలకు గూడెంలో షాడో టీమ్ విక్రయిస్తుంది. అదే సిద్ధాంతం, తీపర్రు, పురుషోత్తపల్లి రీచ్‌ల నుంచి తెస్తే లోడింగ్‌తో కలిపి రూ.11 వేల నుంచి 12 వేల వరకే ఖర్చు కావడంతో అందరూ రీచ్‌ల బాట పట్టారు. ఇది షాడోలకు ఆగ్రహం తెప్పించింది. దీంతో నియోజకవర్గంలో తాము తప్ప ఎవరూ ఇసుక రవాణా చేయకూడదని హెచ్చరికలు పంపారు. మేం కూడా జనసేన పార్టీయే మాకేమి ఇబ్బంది ఉంటుందని అనేక మంది షాడో మాట లెక్కచేయకుండా ఇసుక రవాణా చేశారు. కట్‌చేస్తే.. షాడో బృందం 10 మందికిపైగా యువకులతో టీం ఏర్పాటు చేసింది.

కలెక్టర్ చర్యలు తీసుకోవాలి



తాడేపల్లిగూడెంలో లారీ యజమానులు ఎమ్మెల్యే అండ్ కో వేధింపులతో ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు ఏమీ పట్టించుకోని పరిస్థితి. లారీ అసోసియేషన్ కలెక్టర్‌కు ఇప్పటికే ఫిర్యాదు చేశారు. నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించి లారీ యజమానులపై వేధింపుల ఆపాలి. అసలే వర్షాకాలం కావడంతో భవన నిర్మాణ కార్మికులు పనులు తక్కువగా ఉండే సమయంలో అధికార పార్టీ వేధింపులతో లారీ యజమానులు ఇబ్బందిపడుతున్నారు.

– కొట్టు సత్యనారాయణ, మాజీ ఉపముఖ్యమంత్రి

లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆగ్రహం

షాడో బృందం చేసేదల్లా నియోజకవర్గంలో ఇసుక లారీలు ఎటువైపు తిరుగుతున్నాయి.. బిల్లు ఉందా లేదా అనే వివరాలు చెక్ చేసి లారీ ఫొటో తీసి సదరు షాడోకు పెట్టడం, వెంటనే స్థానిక తహసీల్దార్‌కు అవే ఫొటోలు వెళ్తాయి, తహసీల్దార్‌తో పాటు పోలీసులు రంగప్రవేశం చేస్తారు. చూడాల్సిన మైనింగ్ శాఖ కన్నెత్తి చూడని పరిస్థితి. ఇలా 20కుపైగా వాహనాలను ఆపి హడావుడి చేశారు. బిల్లులు ఉండటం, ఓవర్ లోడింగ్ లేనప్పటికీ ఉద్దేశ్యపూర్వకంగా ఇబ్బందులపాలు చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం పూర్తి బిల్లులతో ఉన్న రెండు లారీలను ఆపి ఇసుకను తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో డంప్ చేయించారు. ఈ వ్యవహారం ముదరడంతో ఆరుగొలను, కొత్తూరు జనసేన నేతలు సమావేశం నిర్వహించారు. అన్ని బిల్లులున్నా ఇసుకను డంప్ చేయడంతో జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో నియోజకవర్గంలో ఇసుక దుమారానికి తెరలేచింది.

అప్రోచ్ రోడ్లు నిర్మించాలి



భీమవరం పట్టణంలో అప్రోచ్ రోడ్డులేని వంతెన వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం: యనమదుర్రు కాలువపై అప్రోచ్ రోడ్ల నిర్మించక నిరుపయోగంగా ఉన్న వంతెనలకు తక్షణం అప్రోచ్ రోడ్లు నిర్మించాలని సోమ వారం భీమవరం సీపీఎం నాయకులు ఆందోళన నిర్వహించారు. అప్రోచ్ రోడ్లు లేని భీమవరం, గొల్లవానితిప్ప, తోకతిప్ప గ్రామాలను సీపీఎం నాయకులు పరిశీలించారు. అనంతరం పట్టణం లోని కేజీఆర్ఎల్ కళాశాల సమీపంలోని వంతెన వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ మాట్లాడుతూ యనమదుర్రు కాలువపై రూ. 100 కోట్ల వ్యయంతో వివిధ ప్రాంతాల్లో వంతెనలు నిర్మించారని.. వాటికి అప్రోచ్ రోడ్లు వేయడానికి పన్నెండేళ్లు దాటినా పూర్తి చేయలేకపోయారంటే ప్రజా సమస్యలపై పాలకులకు శ్రద్ధ ఏ పాటిదో అర్థమవుతుందని దుయ్యబట్టారు. కాలువకు ఇరువైపులా ఉన్న గ్రామాలకు రవాణా సౌకర్యం సక్రమంగా లేక దూరప్రాంతం నుంచి తిరిగి రావల్సివస్తుందన్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, పార్టీ నాయకులు ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఆక్వాజోనైజేషన్



మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం: ఆక్వాజోనైజేషన్ నిర్ధారణలో నిబంధనల మేరకు పారదర్శకతతో కూడిన ప్రతిపాదనలను సిఫార్సు చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో మత్స్య, వ్యవసాయ శాఖ అధికారులు, ఉండి, ఆకివీడు, కాళ్ళ, భీమవరం, పెంటపాడు, గణపవరం మండలాల ఎఫ్‌డీఓలు, ఎంఏఓలతో జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 19న నిర్వహించిన ఆక్వా జోనైజేషన్ ప్రకటన కమిటీలో ఆమోదించిన 31,307.4 ఎకరాల విస్తీర్ణంతో కలిపి ప్రస్తుతం జిల్లాలో 1,32,562.9 ఎకరాల ఆక్వా సాగు విస్తీర్ణం ఉందని తెలిపారు. ఆక్వా జోనైజేషన్ సర్వేలో వివిధ కారణాలతో తిరస్కరించిన 9,855.31 ఎకరాల విస్తీర్ణంపై జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన సోమవారం పునఃపరిశీలన జరిగింది. సమావేశంలో మత్స్య శాఖ సహాయ సంచాలకుడు ఆర్.వి.ఎస్.ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం విఫలం

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



కమిటీల నియామకంపై తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సమీక్ష

పెనుగొండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. సోమవారం తూర్పుపాలెంలో క్యాంపు కార్యాలయంలో మండల గ్రామ కమిటీల నియామకంపై కార్యకర్తలు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. అలవికాని హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి హామీలు అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. రైతులను తీవ్రంగా ఇబ్బందుల పాలు చేసిందన్నారు. నేటి వరకూ వారికి ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించలేదని, ధాన్యం సొమ్ములు సకాలంలో చెల్లించడంలో విఫలమైందని అన్నారు.

పేదలకు ఉన్నత విద్య అందనివ్వకుండా ప్రైవేటీకరణ చేస్తూ తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. వీటిపై పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరాటాలను విజయవంతం చేయడానికి కార్యకర్తలు, నాయకులు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు చిన్నం రామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, నల్లిమిల్లి వేణు ప్రతాపరెడ్డి, ముత్యాల నాగేశ్వరరావు, ఇళ్ల చంద్రకళ, చింతపల్లి గురుప్రసాద్, పులిదిండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో వీఆర్‌ఏల ధర్నా



భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వీఆర్ఏలు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం కలెక్టరేట్ వద్ద సోమవారం వీఆర్ఏలు తమ సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు పీఆర్‌సీని అమలు చేయాలన్నారు. కనీస వేతనం రూ.21 వేలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారికి వీఆర్ఏలుగా ఉద్యోగం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వీఆర్ఏలకు వర్తింపచాలని డిమాండ్ చేశారు.

అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

కలెక్టర్ నాగరాణి



పీజీఆర్ఎస్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): పీజీఆర్ఎస్‌లో అందిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టరు చదలవాడ నాగరాణి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో ఆమె పాల్గొని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు 194 అర్జీలు అందాయని వాటిని ఆయా శాఖాధికారులకు పంపి వేగంగా పరిష్కరించాలని ఆదేశించినట్లు చెప్పారు. అక్టోబర్ 2 నుంచి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రముఖ దేవాలయాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించరాదని, జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం సమిత్వ ప్రగతిపై సమీక్షించారు. ఈ నెల 27 నాటికి సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ బి.శివన్నారాయణ రెడ్డి, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

పారదర్శక చెల్లింపులకు బయోమెట్రిక్ డివైజ్

భీమవరం (ప్రకాశంచౌక్): స్త్రీ నిధి రుణాల పారదర్శక చెల్లింపులకు బయోమెట్రిక్ డివైజ్‌లు అందజేస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రామ సంఘాల సభ్యులకు బయోమెట్రిక్ డివైజ్‌లు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. మొత్తం 850 బయోమెట్రిక్ డివైజ్‌లు అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రొయ్యల చెరువులలో వర్మీ కంపోస్ట్ వాడి అధిక దిగుబడులను పొందాలని కలెక్టర్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్ స్టాల్‌ను సందర్శించి వర్మీ కంపోస్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు.

ఇ-డివిజనల్ మేనేజర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం డివిజన్‌కు సంబంధించిన ఇ–డివిజనల్ మేనేజర్ పోస్ట్ భర్తీకి కాంట్రాక్టు పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. భీమవరం డివిజన్ నందు ఇ-డివిజనల్ మేనేజర్ పోస్టు భర్తీకి అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు అందుబాటులో ఉంచామన్నారు. అక్టోబర్ 3 లోగా దరఖాస్తులు అందజేయాలన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ర్యాలీ



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని మూడు డివిజన్లకు చెందిన విద్యుత్ శాఖ ఉద్యోగులు వారి సమస్యలపై విద్యుత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి సమస్యల పరిష్కారంపై కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ సంస్థ గతంలో అంగీకరించిన వాటిని అమలు చేయాలని కోరుతూ న్యాయమైన 17 డిమాండ్లను పరిష్కరించాలని గత 5 రోజులుగా నిరసనలు చేపట్టామన్నారు.

క్లుప్తంగా

అద్దాల మండప నిర్మాణానికి రూ.కోటి విరాళం



దాత కొండలరావును సత్కరిస్తున్న ఈఓ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో అద్దాల మండప నిర్మాణానికి ఒక భక్తుడు రూ.కోటి విరాళం అందించారు. అనకాపల్లికి చెందిన బొండాడ కొండలరావు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విరాళం చెక్కును ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తికి అందించారు. ఈ సందర్భంగా దాతకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, ప్రసాదాలను అందించడంతోపాటు ప్రత్యేకంగా అభినందించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాత శేషగిరిరావు దంపతులు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు సోమవారం రూ.10,01,116 విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన తాడికొండ శేషగిరిరావు ముందుగా సతీసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఈ విరాళం చెక్కును ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తికి అందజేయగా, ఆయన దాతను సత్కరించి, అభినందించారు. దాత వెంట గ్రామానికి చెందిన పుసులూరి శ్రీధర్ తదితరులున్నారు.

అర్హులకు వాహన మిత్ర లబ్ధి

ఏలూరు (మెట్రో): వాహనమిత్ర పథకం అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఎంపీడీఓలను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారం వాహనమిత్ర పథకం కింద అందిన దరఖాస్తులపై జిల్లా పరిషత్ సీఈఓ, ఎంపీడీఓలతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వాహనమిత్ర పథకం కింద అందిన దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం వెంటనే పూర్తిచేయాలన్నారు. జిల్లాలో వాహన మిత్ర పథకానికి 11,770 దరఖాస్తులు అందాయని, వాటిలో 7,581 దరఖాస్తులు ఈ-కేవైసీ పూర్తి అయ్యాయని, మిగిలిన దరఖాస్తుదారుల ఈ-కేవైసీ పనులు వెంటనే పూర్తిచేసి, అర్హులైన దరఖాస్తుదారుల పరిశీలన వెంటనే పూర్తి చేయాలనీ కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

నేడు ఆట్యా-పాట్యా జిల్లా జట్ల ఎంపికలు

భీమవరం: ఆట్యా-పాట్యా సీనియర్స్ జిల్లా స్థాయి సెలక్షన్స్ ఈనెల 23వ తేదీన భీమవరం శ్రీచింతలపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మంతెన రామచంద్రరాజు, జి.కిరణ్ వర్మ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 25, 26 తేదీల్లో పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు సెలక్షన్స్‌కు హాజరుకావాలని కోరారు.



ప్రజాస్వామ్యానికి విఘాతం



పత్రికా స్వేచ్ఛపై సంకెళ్ల ప్రజాస్వామ్యానికి విఘాతం. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై కేసులు పెట్టడం సరికాదు. సమస్యల పరిష్కారానికి కృషిచేయాలే కానీ సమస్యను చూపించిన జర్నలిస్టులపై ప్రభుత్వం కేసులు నమోదు చేయడం దారుణం. దీనిపై చట్ట సంస్థలు స్పందించాలి. రక్షణ కల్పించాలి. పత్రికా విలువలను కాపాడాలి.

– పి.విజయ్‌బాబు, జెడ్పీ వైస్ చైర్మన్

అప్రజాస్వామికం



పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించడం అప్రజాస్వామికం. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా విలసిల్లుతోన్న పత్రికలు, విలేకర్లపై కేసులు పెట్టి వేధించడం సమంజసం కాదు. అసత్యాన్ని ప్రచురించారని అనిపించినప్పుడు దానికి ఖండన ఇచ్చే వెసులుబాటు ఎప్పుడూ ఉంటుంది. పత్రికల ఎడిటర్‌లపైన, విలేకర్లపైన కేసులు పెట్టడం ఎంత మాత్రం హర్షించదగిన అంశం కాదు. పత్రికలు ఎప్పుడూ ప్రజల పక్షానే పోరాటం చేస్తాయి.

– డీ హరినాథ్, అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి

డీజేలతో గుండె గుబేల్ !

- పెరిగిన డీజేల వాడకం
- అధిక శబ్దాలతో కాలుష్య కాటు
- గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు, గుండె వ్యాధుల వారికి ప్రమాదం
- పట్టించుకోని అధికారులు



ఇంటికి నూతన దంపతులను తీసుకొచ్చే తరుణంలో చేసే ఊరేగింపు (మెర్వణి), రాజకీయ నాయకులకు స్వాగతం పలికేందుకు చేసే ఊరేగింపు,

యలమంచిలి: పండుగలు, పెళ్లిళ్లు, ఉత్సవాలు శుభకార్యం ఎలాంటిదైనా సరే డీజే శబ్దాలు ఉండాల్సిందే. డీజే సంగీతానికి దాని దగ్గర ఉండి ఉత్సాహంగా నృత్యం చేసే వారికి ఆనందంగా ఉంటుందేమోగానీ కొందరికి అదే ప్రాణ సంకటంగా మారుతోంది. పలు ప్రాంతాల్లో డీజేల వద్ద నృత్యం చేస్తూ గుండె ఆగి చనిపోయారన్న వార్తలు ఇటీవల తరచూ చూస్తున్నాం. అంతేగాక దీని వల్ల శబ్ద కాలుష్యం పెరగడంతో పాటు చెవిటి, గుండె సమస్యలు, మానసిక సమస్యలు కూడా వస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయినా వీటి నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా డీజే సౌండ్ బాక్స్ వినియోగం బాగా పెరిగింది. వివాహం అనంతరం ఇంటికి నూతన దంపతులను తీసుకొచ్చే తరుణంలో చేసే ఊరేగింపు (మెర్వణి), రాజకీయ నాయకులకు స్వాగతం పలికేందుకు చేసే ఊరేగింపు, ఏదైనా పోటీలో గెలిచినప్పుడు చేసే ఊరేగింపు ఇలా ఒక్కటేమిటి ఆనందం వచ్చినప్పుడు చేసుకునే ఎలాంటి ఊరేగింపునకైనా డీజే బాక్స్‌తో సంబంధం ఉండాల్సిందే. ఈ సందర్భంగా డీజే సౌండ్ బాక్సులు చేసే శబ్దాలకు యువత ఉత్సాహపు నృత్యాలతో ఆ ప్రాంతం మార్మోగిపోవాల్సిందే. దీని వల్ల అధిక శబ్ద కాలుష్యం వెలువడుతున్నా, హృద్రోగులు, సున్నిత మనస్సు గలవారు, పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నా ఎవ్వరికీ పట్టింపు ఉండదు. వారి ఆనందం వారిదేనన్న విధంగా పరిస్థితులు మారిపోయాయి. విపరీతమైన శబ్దాలతో ఊరేగే డీజే బాక్సులు ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

అధిక శబ్దాలు ఆరోగ్యానికి చేటు!

మనం రోడ్డుపై వెళుతుంటే పెద్దగా శబ్దాలు చేస్తూ వాహనాలు వెళ్తుంటేనే చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. అలాంటిది గంటల తరబడి రోడ్లపై డీజే శబ్దాలతో ఊరేగింపు సాగితే ఇంకెలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. కొందరు అర్ధరాత్రి వరకు డీజే శబ్దాలతో చేసే ఊరేగింపుతో ఎంతో మంది తీవ్ర అనారోగ్యానికి గురవున్నారు. డీజే శబ్దాలతో గుండె సమస్యలు, మానసిక సమస్యలు, వినికిడి లోపాలు, చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యానికి ఇబ్బంది ఏర్పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వాహనాలకు సౌండ్ హారన్లను నియంత్రిస్తున్న అధికారులు డీజేలను ఎందుకు నియంత్రించలేకపోతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇవీ మార్గదర్శకాలు

- బహిరంగ ప్రదేశాల్లో 10 డెసిబుల్స్‌కు మించి శబ్దం చేయరాదు.
- ప్రైవేటు ప్రదేశాల (ఇల్లు, హాళ్లు)లో డీజే శబ్దాలు చేయరాదు.
- లిఖిత పూర్వక అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లు, సౌండ్ బాక్సులు వాడకూడదు.
- నిషిద్ధ ప్రాంతాలుగా గుర్తించిన ప్రదేశాల్లో సంగీత ధ్వనులు, డ్రమ్స్ కొట్టడం, ఇతర శబ్దాలు చేయకూడదు.
- సినిమా థియేటర్లలో సైతం 65 డెసిబుల్స్‌కు మించి శబ్దం రాకూడదు.
- వైద్యశాలలు, విద్యా సంస్థలు, దేవాలయాలు, న్యాయ స్థానాలకు వంద మీటర్ల పరిధిలోని ప్రాంతాలను నిషిద్ధ ప్రాంతాలుగా పరిగణిస్తారు. ఇక్కడ శబ్దాలు చేయడంపై నిషేధం విధించారు.

గుండెపోటు వచ్చే అవకాశం



వృద్ధులు, గుండె సమస్యలు ఉన్నవారికి డీజే శబ్దాల వల్ల అకస్మాత్తుగా గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. సున్నిత మనస్కుల్లో మానసిక ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఏర్పడుతుంది. శబ్దాలకు గుండె జబ్బులు కలిగినవారు, గర్భిణులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడతారు. సాధ్యమైనంత వరకు డీజే శబ్దాలు, అర్ధరాత్రి టపాసుల శబ్దాలు తగ్గించుకోవడం మేలు.

– డాక్టర్ లక్ష్మీపతిరాజు, ఎండీ, పాలకొల్లు

మానసిక ఒత్తిడి పెరుగుతుంది



ఇటీవల డీజే శబ్దాల వాడకం పెరిగిపోయింది. కొందరు అర్ధరాత్రి సైతం డీజే శబ్దాలు, విపరీతమైన పేలుడు శబ్దాలతో టపాసులు పేలుస్తున్నారు. దీని వల్ల మానసిక ఒత్తిడి ఏర్పడుతుంది. బీపీ ఉన్న వారు, ప్రశాంతత కోసం ప్రార్థనలు చేసుకునే వారు ఇబ్బందులు పడతారు. కోపం, మానసిక ఒత్తిడి వల్ల గ్యాస్ట్రబుల్ పెరిగే అవకాశం ఉంది. ఇతరులకు ఇబ్బంది లేకుండా ఉత్సవాలు చేసుకోవాలి.

– డాక్టర్ చంద్రరేఖ, వైద్యాధికారి, దొడ్డిపట్ల

బ్రాందీ షాపులను తొలగించాలంటూ ధర్నా



నూజివీడులోని ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న బాధిత మహిళలు, సీపీఐ నాయకులు

నూజివీడు: మండలంలోని అన్నవరంలో నివాస గృహాలకు దగ్గరగా, పట్టణంలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న బ్రాందీ షాపులను వెంటనే అక్కడి నుంచి తొలగించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహా డిమాండ్ చేశారు. రెండు షాపులను అక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నవరంలో ఉన్న బ్రాందీ షాప్ వల్ల ఆకతాయిలు చేస్తున్న చేష్టలతో మహిళలు, విద్యార్థినులు తీవ్ర భయాందోళనలకు గురి అవుతున్నారన్నారు. అలాగే పట్టణ నడిబొడ్డున మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మద్యం వ్యాపారం చేస్తూ ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగజేస్తున్నా ప్రభుత్వ అధికారులకు గానీ, ప్రజాప్రతినిధులకు గాని చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నివాస గృహాల మధ్య, మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న మద్యం షాపులను తొలగించాలన్నారు. నాయకులు మడుపల్లి నాగేంద్రరావు, చెంగల వెంకటేశ్వరావు, ఆకునూరి విఘ్నేష్, బాధిత మహిళలు పాల్గొన్నారు.

పెంటపాడులో హత్య

- మేనల్లుడిపై కత్తితో దాడి చేసిన మేనమామ
- చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి
- పోలీసుల అదుపులో నిందితుడు



టైసన్‌బాబు మృతదేహం

పెంటపాడు: ప్రశాంతంగా ఉండే పెంటపాడు కునాకరపేటలో సోమవారం తెల్లవారుజామున జరిగిన హత్య కలకలం రేపింది. ఎస్సై స్వామి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెంటపాడు కునాకరపేటకు చెందిన ముప్పిడి టైసన్‌బాబు (కేదార్) (38) కు వివాహమై ఇద్దరు సంతానం ఉన్నారు. బాధ్యతలను పట్టించుకోని కేదార్ ఇంట్లో తన తల్లి సారాభాయ్‌ను నిత్యం వేధింపులకు గురి చేసేవాడు. ఈ నేపథ్యంలో ఈ గొడవలు ఆదివారం రాత్రి తారాస్థాయికి చేరాయి. అర్ధరాత్రి టైసన్‌బాబు తల్లిని తీవ్రంగా దుర్భాషలాడుతూ చంపుతానని బెదిరించాడు. దీంతో అతడి తల్లి సోదరుడైన దైవసేవకుడు తానేటి గిరిబాబు(అలియాస్ జాన్‌బాబు) చర్చిలో ఉండగా విషయం చెప్పింది. కేదార్‌కు నచ్చచెప్పినా వినకుండా వీరంగం చేస్తూ తల్లిని చంపేందుకు వెళుతుండగా కోపోద్రికుడైన జాన్‌బాబు స్థానికుల సాయంతో అతని కంట్లో కారం కొట్టి సమీపంలోని కత్తితో పొడిచాడు. రక్తపు మడుగులో ఉన్న కేదార్‌బాబును స్థానికులు గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కాగా తల్లి సారాభాయ్ ఫిర్యాదు మేరకు పెంటపాడు ఎస్సై స్వామి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. జాన్‌బాబును అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మెట్ట ప్రాంతంలో ఏపుగా ఎదిగిన వరి పొలం

చింతలపూడి: మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని చింతలపూడి వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు వై సుబ్బారావు అన్నారు. ఎంటీయూ 1064 రకం 10,032 ఎకరాలు, ఎంటీయూ 1061 రకం, ఎంటీయూ 1318 రకం , పీఎల్ 1100 రకం , బీపీటీ 5,204 రకాలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పిలక దశలో ఉంది.

వెదజల్లే పద్ధతిలో ఖర్చు తక్కువ

డివిజన్ పరిధిలో వెదజల్లే పద్ధతిలో కూడా రైతులు వరిసాగు చేస్తున్నారు. మెట్టలో ఎక్కువగా నారుడులు, నాట్లు పద్ధతిలోనే సాగవుతుంది. వెదజల్లే పద్ధతిలో ఖర్చు తగ్గుతుంది. నేరుగా వెదజల్లడం వల్ల కలుపు బెడద ఉంటుంది. గడ్డి, కలుపు నిర్మూలనకు ప్రిటిలక్లోర్, సిఫినర్ ఎకరాకు 600 మి.లీ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి విత్తనాలు వెదజల్లిన 3వ రోజులోపు పిచికారీ చేయాలి లేదా బ్యూటక్లోర్ ఎకరానికి 1.2 లీటర్ల ద్రావణాన్ని 20 కేజీల పొడి ఇసుకతో కలిపి పొలమంతా సమానంగా పడేట్లు విత్తిన 3వ రోజు లోపు చల్లాలి. విత్తిన 20 నుంచి 25 రోజుల లోపు వెడల్పాకు కలుపు సమస్య ఉంటే 3డి సోడియం సాల్ట్ పొడి మందును ఎకరాకు 400 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి

సాధారణ పద్ధతిలో సస్యరక్షణ

నాట్లు పూర్తయిన పొలానికి చిరు పొట్టదశలో వేయాల్సిన ఎరువులో నత్రజనితో పాటు మ్యూరెట్ ఆఫ్ పొటాష్‌ని ఎకరానికి 150 నుంచి 200 కిలోల చొప్పున తప్పక వేయాలి. ఆలస్యంగా నాట్లు వేసిన, నీళ్లు నిల్వ ఉండే పల్లపు భూముల్లో జింకు ధాతు లోపం రావడానికి అవకాశం ఉంది. పంటపై జింక్ ధాతు లోపం కనిపించినప్పుడు రెండు దఫాలుగా వారం వ్యవధిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వరిసాగు చేస్తున్న రైతులు నీటి వినియోగం మీద అవగాహన పెంచుకోవాలి. అనవసరంగా ఎక్కువగా నీటిని వాడటం ద్వారా ఎరువుల వినియోగ సామర్థ్యం తగ్గడమే కాకుండా, నీరు కూడా వృథా అవుతోంది. పిలక దశలో ఒక అంగుళం, చిరుపొట్టదశలో రెండు అంగుళాల నీటిని వినియోగించుకుని మెరుగైన దిగుబడులు సాధించాలి. సార్వాలో ముందుగా ఊడ్చిన పొలాల్లో కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగు ఆశించే అవకాశం ఉంది. వీటి నివారణకు లీటరు నీటికి కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. చిరుపొట్ట దశలో ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోలు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోలు వేసుకోవాలి. వరిలో ప్రొఫెనోపాస్‌ను నల్లి నివారణకు కొంత మంది రైతులు పిచికారీ చేస్తున్నారని, వరిలో ప్రొఫెనోపాస్ వాడటం వల్ల దోమపోటు అధికం అవుతుంది. అందువల్ల ప్రొఫెనోపాస్ బదులు ఎసిఫైట్ వాడాలి.



వై సుబ్బారావు, సబ్ డివిజన్ సహాయ సంచాలకులు





విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా రాహుల్



గంటా రాహుల్

నరసాపురం రూరల్ : వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నరసాపురం మండలం సీతారామపురం గ్రామానికి చెందిన రాహుల్ గంటా నియమితులయ్యారు. రాహుల్ తండ్రి సుందరకుమార్ దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేస్తున్నారు. రాహుల్ విద్యార్థి సమస్యలపై పోరాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లిమిల్లి జోసఫ్, ఇంజేటి జాన్ కెనడీ, కాకిలేటి ఆనందకుమార్ (మధు) పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు కోరారు.

ముగిసిన టెన్నిస్ పోటీలు



టెన్నిస్ ర్యాంకింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని కాస్మోక్లబ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీల్లో విజేతలకు క్లబ్ సెక్రటరీ బీవీ రామరాజు బహుమతులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలను నిర్వహించారు. బాలికల అండర్ 17 విభాగంలో మౌపర్ణదాస్, అండర్ 19 విభాగంలో మౌపర్ణదాష్, మహిళల విభాగంలో కాజోల్ సునార్, బాలుర అండర్ 17 విభాగంలో చేతన్ సాయి పటనాన, అండర్ 19 విభాగంలో వపన్ సత్య వెంకటేష్, పురుషుల విభాగంలో తేజా తెలిదేవర సూర్య విజేతలుగా నిలిచినట్లు నిర్వాహకుడు జీపీసీ శేఖరరాజు తెలిపారు.

పిడుగుపాటుకు గేదెల మృతి



ఆగిరిపల్లి: మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షంతోపాటు కొన్నిచోట్ల పిడుగులు పడ్డాయి. రాజవరంలో రైతు తోట రాజబాబుకు చెందిన పశువుల కొట్టం వద్ద పిడుగు పడింది. దీంతో రెండు గేదెలు మృతి చెందాయి. ఒకొక్క గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని రైతు ఆవేదన చెందుతున్నాడు. కుటుంబ పోషణ కోల్పోయిన రైతును ఆదుకోవాలని సర్పంచ్ జాలాభూషణం ప్రభుత్వాన్ని కోరారు.

తమ్మిలేరులో గల్లంతైన మృతదేహం లభ్యం

పెదవేగి : తమ్మిలేరులో గల్లంతైన ప్రకాశం మృతదేహం లభ్యమైందని ఎస్సై కె రామకృష్ణ అన్నారు. బి శింగవరం గ్రామానికి చెందిన గుడ్డేటి ప్రకాశం (40) ఆదివారం తమ్మిలేరు గట్టు వద్దకు గేదెలను మేతకు తోలుకు వెళ్లి, ప్రమాదవశాత్తు తమ్మిలేరులో పడి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. ఈ మేరకు సోమవారం ఎన్డీఆర్ఎఫ్ బలగాలతో గాలింపు చర్యలు చేపట్టగా ప్రకాశం మృతదేహం లభ్యమైంది. ప్రకాశంకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతడి మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించి అనంతరం బంధువులకు అప్పగించనున్నట్లు ఎస్సై చెప్పారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



పార్కింగ్ స్థలంలో తొలగించిన అక్రమ నిర్మాణం

సాక్షి స్పందన

తాడేపల్లిగూడెం: 'కూటమి నేతల ఇష్టారాజ్యం' శీర్షికన గతనెల 14న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి స్పందన వచ్చింది. తాడేపల్లిగూడెంలోని కామాక్షి కమర్షియల్ కాంప్లెక్సులో పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాల్లో కొన్నింటిని ఓ నిర్మాణదారుడు స్వచ్ఛందంగా తొలగించారు. నలుగురు భాగస్వాముల్లో ఒక్కరుగా ఉన్న టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త వలవల బాబ్జీ తన వాటా కింద ఉండాల్సిన పార్కింగ్ స్థలంలో నిర్మించిన మూడు దుకాణాల గోడలను బద్దలు కొట్టించి పార్కింగ్ కోసం ఇచ్చేశారు. ఇదిలా ఉండగా ఈ నిర్మాణాల్లో భాగస్వాములుగా ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారి, ఎరువుల వ్యాపారి, బంగారు నగల వ్యాపారులు మాత్రం స్పందించలేదు. వారి దుకాణాలనూ తొలగించాల్సి ఉంది.

మోటార్‌సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి

అత్తిలి: మోటార్‌సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో కాళ్ల మండలం బండారులంకకు చెందిన ఏలూరి సుబ్బారావు మృతి చెందినట్లు ఎస్సై ప్రేమరాజు తెలిపారు. మోపెడ్‌పై పిప్పర ఆసుపత్రికి వచ్చి సుబ్బారావు తిరిగి వెళుతుండగా మంచిలి వై జంక్షన్ వద్ద మరో బైక్ ఢీకొట్టటంతో గాయపడ్డాడు. మంచిలి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి తణుకు తరలించగా అప్పటికే సుబ్బారావు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సుబ్బారావు కుమారుడు అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

గొలుసు చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్ట్

అత్తిలి: గొలుసు చోరీ కేసుల్లో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను తణుకు రూరల్ సీఐ బి.కృష్ణమోహన్, అత్తిలి ఎస్సై పి.ప్రేమరాజు అత్తిలి పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. సామర్లకోట మండలం పవర గ్రామానికి చెందిన అనుబోయిన నానిబాబు అనే బొంబాయి, పనసపాడు గ్రామానికి చెందిన దొమ్మ రాజు ఒంటరిగా ఉన్న మహిళల మెడలోని గొలుసులు దొంగతనాలు చేస్తున్నారు. వీరిపై తుని, అన్నవరం, రాజోలు, రావులపాలెం, అత్తిలి, ఇరగవరం, తణుకు తదితర ప్రాంతాలలో 11 చోట్ల కేసులు నమోదయ్యాయన్నారు. అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి వద్ద మహిళ మెడలో గొలుసు దొంగిలించి పారిపోతుండగా మంచిలి గ్రామం వద్ద నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 223 గ్రాముల బంగారం, కారును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. నిందితులను తణుకు కోర్టులో హాజరపరచగా 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

క్లుప్తంగా

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం: మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో నాలుగు ఫిర్యాదులు వచ్చాయి. ఇంజనీరింగ్ విభాగానికి మూడు, ప్రజారోగ్యానికి గాను ఒక ఫిర్యాదు వచ్చాయి. కమిషనర్ ఎం.ఏసుబాబు, ఎంఇ.వై.వి.రమణ, ఏసీపీ సీతారాం, మేనేజర్ రవిసుధాకర్ , ఇతర అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచుకున్నాయి


మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ నేషాద్ మోహిద్దీన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్రంలోని బీజేపీ ఆధ్వర్యంలో ఎన్‌డీఏ ప్రభుత్వం గత ఎనిమిది సంవత్సరాలుగా నిత్యవసర, ఇతర వస్తువులపై జీఎస్టీ పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచి, ముక్కుపిండి వసూలు చేసిందని, నేడు ఎదో తగించామని వారు చంకలు గుద్దుకోవడం శోచనీయమని వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ నేషాద్ మోహిద్దీన్ అన్నారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుత అంతర్జాతీయ ధరల ప్రకారం పెట్రోల్ రూ. 80, డీజిల్ రూ. 70, కాల్ గ్యాస్ రూ. 550 లేదా అంత కంటే తగ్గించి బీజేపీ ప్రభుత్వం చంకలు గుద్దుకోవాలని వెల్లడించారు. ఇప్పటి వరకు ప్రజలు వద్ద నుంచి జీఎస్టీ పేరుతో దోపిడి చేశారని, నిత్యావసర ధరల పెరుగుదలతో సామాన్యులు అనేక ఇబ్బందులు పడ్డారని చెప్పారు. జీఎస్టీ పేరుతో దోచుకున్న సొమ్ములను ప్రతి కుటుంబానికి నష్టపరిహారంగా అందజేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ప్రజలే బీజేపీకి, ఎన్‌డీఏకు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి



సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాలను, పదమూడు గంటలకు పెంచుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని పోలీస్ ఐలాండ్ వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. వక్తలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలను నూటికి నూరు శాతం సమర్థిస్తూ రాష్ట్రంలోని కార్మిక వర్గానికి తీవ్ర ద్రోహం చేస్తుందని విమర్శించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలల్లో 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చడం, కార్మికులను బానిసలుగా చేసిందని వాపోయారు. పదమూడు గంటల బిల్లు ఆమోదం పొందితే తిరిగి కార్మికులు కట్టుబానిసలుగా మారడం ఖాయమన్నారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ మహిళలు రాత్రి సమయంలో పనిచేయాలని ఈ బిల్లులో పొందుపరిచారని, ఈ విధానం సరికాదన్నారు. మహిళలకు రక్షణ ఉండదని చెప్పారు. బిల్లును ఉపసంహరించుకోకపోతే ఉద్యమాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. శిద్ది రెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, అయినాల సత్యనారాయణ, ఆర్.గోవిందు, రావి శ్రీనివాసరావు, పి.ప్రభాకర్‌రావు, నరమాల కృష్ణ, పులిమంతలు రమణ, పతివాడ నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి


మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

అత్తిలి: కేరళ వామపక్ష ప్రభుత్వం మాదిరిగా రాష్ట్రంలో వ్యవసాయ కూలీలకు కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం అత్తిలి మండలం రెండవ మహాసభ వనం రాంబాబు అధ్యక్షతన సోమవారం అత్తిలి సుందరయ్య భవనంలో జరిగింది. ముందుగా సంఘ పతాకాన్ని దాయం వెంకన్న ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో సత్యనారాయణ, వీరభద్రరావు మాట్లాడుతూ శ్రమజీవులైన వ్యవసాయ కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని వారు గుర్తు చేశారు. రాష్ట్రంలో కోటీ 50 లక్షల వరకు వ్యవసాయ కూలీలు ఉన్నారని, ప్రభుత్వ లెక్కల ప్రకారం వ్యవసాయ కూలీలలో 90% ఎస్సీ, ఎస్టీ, బీసీలే అని అధిక సంఖ్యలో మహిళలు ఉన్నారని తెలిపారు.

జగనన్న కాలనీలో సమస్యల తిష్ట

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- బురదమయంగా రోడ్లు
- డ్రెయినేజీ లేదు..కొరవడిన పారిశుద్ధ్యం


ఇరగవరంలో జగనన్న కాలనీకి వెళ్లే రహదారి నిండా వర్షపునీరు


వర్షపు నీటిలో ప్రయాణిస్తున్న కాలనీ వాసులు

ఇరగవరం: పేదల కాలనీల్లో సమస్యలు తిష్ట వేసినా కూటమి ప్రభుత్వం స్పందించడం లేదు. ప్రజలు వసతులు ఏర్పాటు చేయాలని కోరుతున్నా వారిలో చలనం రావడం లేదు. తణుకు నియోజకవర్గం ఇరగవరం మండలంలో జగనన్న కాలనీలో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. కాలనీలో సుమారు 300ఇళ్లు ఉన్నాయి. వెయ్యి మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు.

వినతులు విస్మరించిన కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కాలనీలో వసతుల ఏర్పాటు పట్టించుకోవడం లేదు. చినుకుపడితే కాలనీలోకి వెళ్లే గ్రావెల్ రోడ్లు బురదమయంగా మారాయి. గోతులు పడి అధ్వానంగా కనిపిస్తున్నాయి. ప్రధాన రోడ్ల నుంచి కాలనీలోకి వెళ్లాలన్నా బయటకు రావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వాడుక నీరు రోడ్లపై నిలిచిపోతుంది. చిన్నపాటి జల్లు పడినా కాలనీలోకి వెళ్లే రోడ్లతో పాటు అంతర్గత రోడ్లలో నీరు నిలుస్తున్నాయి. చెరువులుగా మారి బురదమయంగా మారుతుండటంతో పాటు ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రాలేకపోతున్నారు.

జారిపడటమే...

కాలనీలో వారంతా కూలికి వెళ్లి రోజు గడుపుకొనే పేదవారే. పనులకు వెళ్లిన వారు చీకటి పడితే కాలనీలోకి రావాలంటే రోడ్డుపై జారీ బురదలో పడి గాయాలపాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లలేకపోతుండగా వృద్ధులు ఇంటి నుంచి బయటకు రాలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దోమలు ప్రబలడంతో స్థానికులు వైరల్ ఫీవర్స్, మలేరియా, డెంగీ జ్వరాలబారిన పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయడంతో కాలనీలో పారిశుద్ధ్యం, తాగునీరు సక్రమంగా జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



గత ప్రభుత్వంలో ఇచ్చిన జగనన్న కాలనీలు ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో జగనన్న కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు, మహిళలు చిన్న పిల్లలు, వృద్ధులు, మురుగు నీటిలో ప్రయాణలు, దోమలతో ఇబ్బందుల పడుతున్నారు. ప్రభుత్వం పట్టించుకుని సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ప్రజల తరుపు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రించాలి లేకపోతే ప్రజల పక్షాన్న పోరాటం చేయడానికి వెకాడం

కామన మునిస్వామి, సీపీఎం మండల కన్వీనర్ ఇరగవరం

తణుకు చేరిన అయోధ్య కల్యాణ రాముడి విగ్రహం


తణుకులోఅయోధ్య కల్యాణ రాముడి విగ్రహాన్ని వీక్షిస్తున్న భక్తులు

తణుకు అర్బన్: అయోధ్య కల్యాణరాముడి ఆలయంలో ప్రతిష్ఠించే కల్యాణ రాముని విగ్రహం, కోదండం, పాదుకలు అనేక ప్రాంతాల పర్యటనలో భాగంగా తణుకు చేరడంతో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అయోధ్యలో శ్రీరాముని సేవలో తరిస్తున్న చల్లా శ్రీనివాసశర్మ నిర్మిస్తున్న కల్యాణ రాముడి ఆలయంలో ఏర్పాటు చేసే విగ్రహాలు తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది సూరంపూడి కామేష్ గృహానికి ఆదివారం రాత్రి చేరాయి. దీంతో పట్టణ ప్రముఖులంతా కామేష్ నివాసానికి వచ్చి శ్రీరాముడి రూపాన్ని తనివితీరా వీక్షించారు. నవరాత్రుల సమయంలో తన నివాసానికి శ్రీరాముడి ధనుస్సు, రామబాణం , పాదుకలు చేరడం సంతోషంగా ఉందని కామేష్ తెలిపారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ నారాయణ రావు దంపతులు, డాక్టర్ రామచంద్రరావు, నాగమణి దంపతులు, గమిని రాజా, గమిని రాంబాబు, ఆడిటర్ పి.శ్రీనివాస్‌లు ఉన్నారు.

అమ్మా భవానీ.. సదా స్మరామి

- ఘనంగా దసరా మహోత్సవాలు
- భక్తిశ్రద్ధలతో దీక్షల స్వీకరణ
- దసరా సెలవులతో సందడిగా పుణ్యక్షేత్రాలు


బాలాత్రిపుర సుందరీదేవిగా శ్రీవాసవి కన్యక పరమేశ్వరీ అమ్మవారు


వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీదేవిని శైలపుత్రిగా అలంకరించిన దృశ్యం


ముత్యాలమ్మ వారిని రజిత కవచ ముత్యాలమ్మగా అలంకరించిన దృశ్యం


తణుకులో రజత కవచాలాంకృత అలంకరణలో ముస్తాబైన వాసవీ మాత


రావిపాడు దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు


బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో పండ్లుతో విశేష అలంకరణ


సర్వమంగళాదేవి అమ్మవారు


అత్తిలి మండలం ఆరవల్లిలో బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గ అమ్మవారు


ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద విద్యుత్ దీపకాంతులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. తణుకు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో పల్లె పల్లెలో వివిధ అమ్మవారి ఆలయాల వద్ద శరన్నవరాత్రి శోభ సంతరించుకుంది. వివిధ సెంటర్లలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ సెట్టింగ్‌లు, చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలతో అలకరించడంతో ఆలయాల్లో ఉత్సవ శోభ సంతరించుకుంది. తాడేపల్లిగూడెం పట్టణంలో పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారిని శ్రీ బాలా త్రిపురసుందరీదేవిగా విశేష అలంకరణ గావించారు. అమ్మవారిని, ఆలయ అంతరాలయం, గర్భాలయం, మండపమును పది టన్నుల పండ్లతో విశేష అలంకరణ జరిగింది. అమ్మవారిని గజమాలతో ప్రత్యేంగా అలంకరించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీరంగం అంజిబాబు పర్యవేక్షించారు.

శ్రీ వాసవి కన్యక పరమేశ్వరీ ఆలయం అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగాను, గజమాలతను విశేష అలంకరణ గావించారు. గౌరవ అధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు కొర్లెపర శ్రీరామచంద్రమూర్తి, వబిలిశెట్టి నటరాజు, నున్న సుందరం, ఆర్యవైశ్యులు, మహిళలు పర్యవేక్షించారు. వీకర్స్‌కాలనీ శ్రీ గాయత్రీదేవి ఆలయంలోను అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. శంకరమఠంలో సర్వమంగళామ్మవారిని శ్రీ రజత కవచాలంకృత సర్వమంగళాదేవిగా విశేష అలంకరణ చేశారు. శ్రీదేవి మహంకాళమ్మ తల్లి ఆలయంలోని అమ్మవారిని శ్రీ బాల త్రిపుర సుందరీ దేవిగా విశేష అలంకరణ గావించారు. నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రజత కవచాలాంకృత అలంకరణలో వాసవీ మాత

తణుకు అర్బన్: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తణుకు శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ప్రార్థనా మందిరంలో వాసవీ మాత సోమవారం రజత కవచాలాంకృత అలంకరణలో దర్శనమిచ్చారు. దేవీ నవరాత్రి మహోత్సవాలు మొదటి రోజు కావడంతో వాసవీ మాతను దర్శించుకునేందుకు భక్తులు, ఆర్యవైశ్య మహిళలు అధికసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ చైర్మన్ గమిని రాంబాబు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో..

అత్తిలి: మండలంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. అత్తిలిమండలం ఆరవల్లి గ్రామంలో గల కనకదుర్గా భవానీ అమ్మవారికి ఉదయం అభిషేకాలు జరిపి, విశేషంగా అలంకరించారు. అమ్మవారుని బాలా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ ఆలయ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, అంబికాదేవి దంపతులచే అమ్మవారిని పుష్పాలంకరణ చేసి, ప్రసాదాన్ని నివేదించారు.

వీరంపాలెంలో ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం బాలాత్రిపుర సుందరీ పీఠంలో సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి పర్యవేక్షణలో కర్రి వెంకటరామకృష్ణారెడ్డి - స్వర్ణప్రద దంపతులు కలశ పూజ చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. తొలి రోజు బాలా త్రిపుర సుందరీదేవిని శైలపుత్రిగా అలంకరించారు. ఈ సందర్భంగా వెంకటరమణ శాస్త్రి మాట్లాడుతూ శరన్నవరాత్ర మహోత్సవాల్లో అమ్మవారిని దర్శించి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. 108 సార్లు నవరాత్రుల్లో లలిత సహస్రనామ పారాయణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ రజిత కవచ శ్రీముత్యాలమ్మగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అన్నెంనీడి భవానీరాజు - సత్యలక్ష్మి దంపతులచే సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారి ఆలయాలలో సోమవారం దసరా ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రధానంగా ప్రత్తిపాడు వై.జంక్షన్ అమ్మవారి ఆలయం, కాగులంపాడు రోడ్డులోని అమ్మవారి ఆలయాలలో విద్యుత్ కటౌట్‌లు భారీగా వెలిసాయి.

జీఎస్టీ తొలగింపుపై సంబరాలు


తణుకు ఎల్ఐసీ కార్యాలయంలో కేకు కట్ చేస్తున్న ఎల్ఐసీ ఏవోఐ నాయకులు


ఎల్ఐసీ కార్యాలయం వద్ద నాయకులు

తణుకు అర్బన్: ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ ఏఓఐ) పోరాటాల ఫలితంగా ఎల్ఐసి పాలసీలపై జీఎస్టీ తొలగింపు నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకుందని ఎల్ఐసీ ఏవోఐ జోనల్ జనరల్ సెక్రెటరీ పీఎల్ నరసింహారావు అన్నారు. సోమవారం తణుకు ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 జులై 1వ తేదీ నుంచి ఎల్ఐసీ పాలసీ ప్రీమియంలపై అమలవుతున్న జీఎస్టీ తొలగించాలని గల్లీల నుంచి ఢిల్లీ దాకా ఎల్ఐసీ ఏవోఐ చేసిన పోరాట ఫలితమే ఈ జీఎస్టీ తగ్గింపు అని స్పష్టం చేశారు. జీఎస్టీ తగ్గింపు పేద మధ్యతరగతి చిన్న పాలసీదారులకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. తణుకు సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కేఎస్ రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ జి దుర్గాప్రసాద్, తణుకు ఎల్ఐసి ఏఓఐ గౌరవాధ్యక్షుడు సత్తి పాండురంగారెడ్డి, ఎల్ఐసీ ఏవోఐ అధ్యక్షుడు సలాది ఉదయభాస్కరరావు, కార్యదర్శి మడిచర్ల రవిరామకృష్ణ, కోశాధికారి రామ్ ప్రసాద్, ఏజెంట్స్ యూనియన్ నాయకులు రామనాథ్, ఎస్వీఎల్ నరసింహారావు, దత్తి కృష్ణవేణి, సుందర్‌రావు, రమణమూర్తి, పోలిశెట్టి శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్స్ పోరాటంతోనే ఎల్ఐసీ పాలసీలపై జీఎస్‌టీ రద్దు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎల్ఐసీ పాలసీలపై జీఎస్‌టీ రద్దు వెనుక ఏజెంట్స్ యొక్క నిరంతర పోరాటమే కారణమని ఎల్ఐసీ ఏజెంట్స్ యూనియన్ నాయకుడు పి.గోవింద్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎల్ఐసీ బ్రాంచ్ వద్ద సోమవారం పాలసీలపై జీఎస్‌టీను రద్దును స్వాగతించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ జీఎస్టీ రద్దు కోరుతూ బ్రాంచ్ లెవెల్ నుంచి బొంబాయి సెంట్రల్ కార్యాలయం, ఢిల్లీ పార్లమెంట్ ముందు ఎల్ఐసీ ఏఓఐ ఎన్నో ఉద్యమాలు చేసిందని చెప్పారు. రాజమండ్రి డివిజన్ నాయకులు కె.వెంకటేశ్వరరావు, పల్లి వెంకట నరేష్, జీఎస్ఎన్‌మూర్తి, మేషక్ బాబు, టి.పాండురంగారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ తాడేపల్లిగూడెం డివిజన్ నాయకులు జేఈ నారాయణ, జేఈసీ చైర్మన్ సీతారాముడు, కొండలరావు, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, మల్లుల సత్యనారాయణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో విలేకర్లతో మాట్లాడుతూ విద్యుత్ యూనియన్లు రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు దశలవారీ ఆందోళనలు చేశామన్నారు. దీనిలో భాగంగా సోమవారం భీమవరంలోని ఏపీఈపీడీసీఎల్ జిల్లా కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు జరిగిన పవర్ జాక్ పిలుపు మేరకు శాంతియుత ర్యాలీ విజయవంతమైందని తెలిపారు. అనంతరం భీమవరంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని, అధికారులు సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వ దృష్టికి, సీఎండీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. ఈ యాత్రలో ఉమ్మడి జిల్లాల నాయకులు భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం డివిజన్‌లు నాయకులు నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


కె కుముదవల్లి వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది


ఆరుళ్ళ వెల్‌నెస్ సెంటర్ వద్ద స్వస్త్ నారీ - స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం

ఇరగవరం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని ఇరగవరం పీహెచ్‌సీ వైద్యురాలు వై.మౌనిక తెలిపారు. మండలంలోని కె కుముదవల్లి గ్రామంలో సోమవారం ఇరగవరం 110మంది రోగులను వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు మౌనికా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రా ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నా స్వస్త్ నారీ - స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామయణం జగదీష్, ఎంపీటీసీ పిండి గోవింద్, బసవా నాగేశ్వరరావు, సీహెచ్‌వో ఎస్‌కె ఖాన్ సాహెబ్, ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడి సిబ్బంది, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుళ్ళ వెల్‌నెస్ సెంటర్ వద్ద సోమవారం స్వస్త్ నారీ -స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరం పీహెచ్‌సీ వైద్యురాలు సింధు మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణులు ఆహారంలో పోషకాలు కలిగిన చిరుధాన్యాలను తీసుకోవాలన్నారు. మహిళల ఆరోగ్యం ఇంటికి బలాన్ని ఇస్తుందన్నారు. మాజీ సర్పంచ్ మాకరాజు సతీష్, గూడవల్లి నాగేశ్వరరావు, ఊడిమూడి నాగరాజు, డాక్టర్ కే.బాబ్జీ, ఏఎన్ఎం బి.సుభాషిణి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు జి.విజయలక్ష్మి, జి.సూర్యకుమారి, పి.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంచారంతో ఇక్కట్లు

నరసాపురం: స్థానిక మున్సిపాలిటీలో రోడ్లపై పశువుల బెడద ఎక్కువగా ఉంది. రోడ్లపై ఆవులు, గేదెలు, దూడలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో పారిశుద్ధ్య, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని నెలల క్రితం పట్టణంలో ఎక్కడా రోడ్లపై పశువులు, పందులు కనిపించకూడదని మున్సిపల్ అధికారులు హడావుడి చేశారు. పందులను పట్టుకోవడం, రోడ్లపై తిరుగుతున్న పశువుల యజమానులకు నోటీసులు ఇస్తామని హెచ్చరికలు కూడా చేశారు. తరువాత ఈ విషయాన్ని మరిచిపోయారు. రోడ్లపై విచ్చలవిడిగా పశువులు సంచరించడంతో బైక్‌లు, సైకిళ్లపై వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే ఈ సమస్యకు కారణమనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.